# పశ్చాత్తాపమే పతితపావనము

శ్రీమతి దుర్భా హనుమావతీగారు

[ఈవ్యాసమును రచించిన వ్యాసకర్త్రి, శ్రీయుత కొండా వెంకటప్పయ్యపంతులు అయ్యాదేవర కాళేశ్వరరావుగార్ల సిఫార్సులపైని, "ఇప్పుడిప్పుడే చిగుర్చుచున్న జాతీయభావములను పెంపొందించుకొనుటకు", (తల్లిదండ్రులును అత్తమామలును కాదనుచున్నను) భర్తగారితో సహా వార్ధావెళ్లి జమ్నలాలు బజాజుగారు స్థాపించిన సత్యాగ్రహాశ్రమములో మూడుసంవత్సరములు విద్యాభ్యాసముచేయు సంకల్పములతో చేరినారు. ఆశ్రమమునందీమె యొక్కతెయే ఆంధ్రబాలిక. భర్తగారు చుట్టుపట్లగ్రామ పునర్నిర్మాణ కార్యక్రమమును పరిశీలించుచుందురు. ప్రకటింపబడుచున్న కథా సందర్భమునుగూర్చి ఆమె యిట్లు వ్రాయుచున్నారు. "మాకుటుంబములో జరిగిన ఒకానొక ఘటనను ఉదాహరణముగాగొని స్వానుభవముచే వ్రాసిన వ్యాస మిది కాన స్త్రీలోకమునకు జరుగు అన్యాయములను ఖండించనంతవరకు నామనస్సొప్పినదికాదు". ఇట్టి సంభవములు జరుగకుండునట్లు ప్రచారముచేయవలసినభార మాంధ్రదేశీయులపై నున్నది. గృ॥ సం॥]

౧

మోహనరావు:—పిన్నీ! మీవారు నీతో అనుకూలంగా ప్రవర్తిస్తున్నారా? మొన్ననే తాతయ్య 500 రూపాయలు పంపించమంటే, పంపించాడట. అంతటితో తృప్తిపొందాడా లేక డబ్బుకి తెప్పించమని కొడుతున్నాడా?

శాంతాకుమారి:—అబ్బాయి! క్రిందటి వారం నాడు నాన్నిచ్చిన కట్టుకానులపేరు తీసికెళ్లి అక్క కూతురికిచ్చారు. డబ్బంతా తీసికెళ్లి స్నేహితులకు వేశ్యలకు ఖర్చెడతారు. ఆ మాయలమారి అక్క, మా అత్తగారు లేనిపోని పుల్లిందాలపెట్టి నాదుంప తెంపుతున్నారు. ఎన్నివిధాల బతిమాలినా, ఎంత వేడినా నామాటలు చెవినిబెట్టరు సరిగదా, నా మోమైనా చూడరు. హిందూసంఘమందు స్త్రీలు పడుపాట్లు ఎవరు లెక్కిస్తారు! కాపరాని కొచ్చినది మొదలు సుఖమెట్టిదో యెరుగను! రోజు దెబ్బలు తిట్లుతప్పవు!! మానాన్నకు ఏకపుత్రిక నగుటచే ఆయనకు నాయందపార ప్రేమ. నాసుఖానికొరకు ఆయన ఎన్నిపాట్లైనా పడ్డాడు. ఎన్నివంచనలయినా భరించాడు. ఎంతడబ్బయినా ఖర్చెట్టాడు. కాని ఏమిలాభం? ఆయనను చూస్తే నాగుండె తరుక్కుపోతోంది. ఆయన కష్టాలన్నిటికీ నేనేకదా కారణం అని అప్పుడప్పుడు దుఃఖం పొంగిపొంగి వస్తూండేది. కాని హైందవభార్యకు దిక్కెవ్వరు. వాళ్ళమొరాలకించేవారెవరు!! పురుషుడేపని చేసినా చెల్లుతోంది.

మోహ:—పిన్నీ! మనసంఘంలో స్త్రీజీవితము చాల దుర్భరముగానుంటుంది. పూర్వాచారాలభావాలని ఆచరణలో పెట్టలేక ఎవరి కనుకూలముగనున్నట్లు వారు వారియిచ్ఛ వచ్చినరీతి ఆచరణలో పెడుతూ సంఘమును సంస్కారము చేస్తేనేగాని స్త్రీలకు ముక్తి దొరకదు. సరే నేను వెళ్ళుతున్నాను. తాతయ్యతో ఏమని చెప్పమంటావు.

శాంత:—కులాసాగాఉన్నానని చెప్పు. వాకర్త వ్యాలను, ధర్మాలను శాంతస్వభావంతో నెరవేరుస్తున్నానని చెప్పు. జైలుకెప్పు డెళ్లుతావురా అబ్బాయి.

మోహ:—వచ్చేవారం జాతీయవారం. కాంగ్రెసు ఆదేశానుసారంగా శాసనతిరస్కారంచేసి జైలుకెళతాను........సరే, వెళతా.

౨

శాంతా! శాంతా!! ఎక్కడున్నావ్? డబ్బుకు రాస్తావా?

శాంత:—ప్రాణేశ్వరా! దుర్వినియోగం చేస్తే మానాన్నగారు మట్టుకు ఎందాకా పంపిచగలరు? సద్వినియోగంచేస్తే పంపుతారు కాని ఒకసారియైన మీకరుణాకటాక్షవీక్షణాల్ని నామీద ప్రసరింపజేయండి!! నాసేవలను స్వీకరించండి! నామీదజాలి కలుగదా? వ్యర్థంగా అర్థాన్ని దుర్వినియోగంచేసే బదులు వార్తాపత్రికల దెప్పించండి; సద్గ్రంథకాలక్షేపము చేయండి; పరమపవిత్రమగు గృహస్థాశ్రమమందు అర్ధాంగి నగు నాసహాయమును గూడ నపేక్షించి ఉభయుల జీవితాన్ని సార్థకముజేయండి. దేశంలో గాంధీశకమందు జరిగే మార్పులగాంచి, మీకర్తవ్యమును గూడ నెరవేర్చండి.

సుందరమ్మ:—ఏమే, వొళ్ళుపై తెలియకుండ మాట్లాడుతున్నావు!! మొగుడు మర్యాదా అక్కర్లే!! శ్రీరంగనీతులు చెప్పుచున్నావు!! పొయ్యిదగ్గర కూర్చుండేదానికి ప్రపంచకసంగతు లెందుకే నీకు? —ఏంరా అబ్బాయి ఆట్టెసాగిస్తున్నావు ఆటలు అదురుబెదురు పెట్టక్కర్లా?

భర్త:—భడవ,........బద్మాష్...! ఒళ్లు తెలియక ప్రేలుతావ్"......అని బాదేడు శంకర రావు తనయక్కయగు సుందరమ్మమాటలువిని.

## 3

అత్తగారింటినుంచి పుట్టింటికొచ్చి ఆరునెలలైనా నాభర్తగారి మనస్సునుమార్చి జీవితాన్ని సార్థకము చేసుకుందామని ఎంతప్రయత్నించినా భగవంతు డన్యధాతలంచేడు. ఆదర్శహిందూరమణీమణియొక్క పవిత్రధర్మము భర్తృపాదారవిందముల సేవయేగదా!! కాని పురుషులహృదయాలు పాషాణములవలె కఠినముగానుండ కోమలహృదయలగు నారీమణులకు తావెక్కడ. రాతిలో మొక్క మొలుస్తుందా! ఎన్ని పాట్లుపేడుకొన్నా స్వీకరించారుకారు నాభర్తగారు. వారుతొందరపడి ఎక్కడ మృదుత్వాన్ని వెళ్లడిస్తారోయని మాఆడబిడ్డయగు సుందరమ్మ విషపూరితోపదేశాల్ని వారిహృదయములో నింపేసేది. కాపరానికి వెళ్లిందిమొదలుకొని మాయింటి కొచ్చేవరకూ ఒకరోజు—ఒకరాత్రియైనా సుఖమెరుగనిచ్చింది కాదు ఆమహాతల్లి!! ఇంతకూ ఒకరినంటే ఏమిలాభం? ఇదంతా నాఖర్మం!!

ఇంటికొచ్చి 8 మాసములైనాయి. భావిభాగ్యాని కెదురుచూస్తూండేదాన్ని—నాభర్తహృదయం మారిపోతుందా, ఎల్లకాలం కష్టాలుంటాయా యనియనుకునేదాన్ని. నాతలిదండ్రులను దుఃఖంనుండి పూరడిస్తుండేదాన్ని. భక్తిప్రేమ కరుణలతో లేఖల్నివ్రాసి హృదయపరివర్తనానికి ఎదురుచూస్తూండేదాన్ని.

సంవత్సరమైంది కారుమబ్బులింకా తీవ్రరూపాల్నిదాలుస్తున్నాయి; ఆశాపాశము వదలలేదు. సంవత్సరంనాలుగుమాసాలు గడిచాయి. గాఢధ్వాంత సమితుల్లో విద్యుత్కాంతులకేసి చూస్తుండేదాన్ని. సంవత్సరంన్నర గడిచింది.

ఒకరోజున మానాన్న పొంగిపొంగి వస్తూన్న దుఃఖాన్ని ఆపుకొంటూ కన్నీళ్ళతో ఒకవుత్తరం చూపించాడు నాకు: నాభర్తగారి పొరుగింటాయన వ్రాసేడు ఆవుత్తరం: ఆయన నాయందు మానాన్నగారియందు చాలాప్రేమగా యుండేవాడు: గౌరవనీయుడు. వుత్తరంలో, సదాచార సంపన్నుడగు ఒక అమాయకబ్రాహ్మణ్ణి మాటలతో మోసగించి, నాభర్తకు మా ఆడబిడ్డ అత్తగార్లు సంబంధం కుదిరించారనీ నాభర్త వాళ్ళప్రోద్బలముచే రెండోపెండ్లి చేసుకొన్నాడని వ్రాసేడు. ఈసంగతి వినగానే గుండె గుభేలుమన్నది. ఆశాపాశలన్నీ ఒక్కమారు తెగిపోయినవి. భయక్రోధ సంభ్రమములన్ని ఒక్కమారు ఉత్పన్నమైనవి. ప్రపంచమంతా చీకటి కమ్మినట్లు తోచింది. జీవితమంతా వ్యర్థమేగదాయని యనుకొన్నాను. ఇల్లా ఆరునెలలుగడిచాయి. ఇద్దరుభార్యలున్నవాళ్ళెంతమందో ఉన్నారుగదా, నన్నుగూడ లోకంలో ఇతరులవలె స్వీకరించి సంసారసాగరాన్నీదమని పెద్దమనుష్యులు, మానాన్న ఎంతో చెప్పేరు నాభర్తగార్కి. కాని ఏంలాభం!! అబలలపై అత్యాచారాలు చేయటానికి సంఘమొప్పుకుంటుంది కాని పురుషుణ్ని దండించటాని కొప్పుకుంటుందా? వానికేమి మొగాడు. వా డిష్టమొచ్చినట్లు చేస్తాడని అటుందికాని —అయ్యో! పాపం! ఆనారీరత్నముయొక్కగతిఏమిటి. ఆపతివ్రతామతల్లి తనజీవితాన్ని బూడిదలోపోసిన పన్నీరువలె వ్యర్థపరచవలసిందేనాయని విచారించదుగదా.

ఆశలన్నిటిని నిరాశచేసుకొన్నా! శ్రావణమాసం: వూళ్ళో తోడిబాలికలందరు రకరకాల చీరెలతో వొంటినిండా అభరణాలు ధరించుకొని పార్వతిలాగ నొసటకుంకుమబొట్టు దిద్దుకొని, కాళ్ళకు పసుపు పూసుకొని మా యింటిముందరినుంచి వెళుతూ నన్నుగూడా పేరంటానికి పిల్చేవారు. నాహృదయాంతర్గతంలో శోకాగ్ని ఎల్లా ప్రజ్వరిల్లుతుందో వారికేమితెలుసు. వస్తూన్న దుఃఖాన్ని ఆపుకొని ఇంటిలోపనిఉందని వంకెట్టి పేరంటానికికూడ వెళ్ళేదాన్నిగాదు. వెళ్లేఅర్హతకూడ నాకేముంది. భర్తను వొదిలిపెట్టిన ఈమెగూడ రావాలీ పేరంటానికి అని అంటారులోకులు. నాతలిదండ్రుల దుఃఖాన్ని చూడలేకపోయేదాన్ని కొన్నాళ్ళు. నాఆడబిడ్డను అత్తను దూషిస్తుండేదాన్ని సంఘాన్ని దూషిస్తుండేదాన్ని; కొంతకాలం సంఘదృష్టిలో స్త్రీలు, పురుషులయొక్క

భోగ విలాసాలకు తృప్తికలుగజేసే వస్తువులని, ఎల్లప్పుడు వారు పొయ్యిదగ్గర పనిచెయ్యటానికని, ప్రపంచకంతో వారికేమి సంబంధ ముండకూడదనీ, స్త్రీలజీవితములు పురుషుల చేతులలో వుండాలనీ, పురుషులేమిచేసిన స్త్రీలు సంహించాలనీ ఉన్నప్పుడు సంఘాచారాలన్నీ నిర్మూలించక ఇతరులను దూషిస్తే లాభములేదనుకున్నా. నాభర్తకు ఇవ్వగా మిగిలిన ఆభరణాలన్నీ పెట్టెలోదాచి సమయము వచ్చినప్పుడు దేశసేవకు వినియోగిద్దామని నిశ్చయించుకొన్నా. ప్రపంచములో ఎవరికోసమా బ్రతుకుటయని తలపోసేదాన్ని. ఆత్మహత్య చేసుకొందామాయని అనుకొన్నాను. 'ఛీ' ఆత్మహత్య మహాపాతకమను మనశాస్త్రములఘోషింపు వెంటనే కర్ణకుహర ద్వారములజొచ్చేది. మోహనునివలె దేశసేవచేయటానికి వెళుదామా యని యనిపించేది. కాని కుళ్లి కృశించిపోతూన్న మాజీవితాల్ని సంఘబహిష్కారాలతోను, నిందలతోను, ఇంకా కృశించి పోతాయని అనుకొని భయముచే మానుకొన్నాను. ఈవిధంగా మనస్సునకు శాంతికలిగేదేకాదు. నా అవస్థలన్నీ నామనోవైకల్యాల్ని ఎవరితో మొరపెట్టుకునేది. న్యాయమార్గముమ చూపు సమదర్శిని ఎవరు స్త్రీలకు. సంఘంలో సహజంగా స్త్రీ మంచికీను చెడ్డకీను అతి సాహసురాలు. ఆసహజగుణమే నాలోకూడ ఇప్పుడు ప్రజ్వరిల్లింది. ఓనాడు దేశసేవ చేస్తామా యని బయలుదేరనిశ్చయించుకొన్నా: బయలుదేరానుకూడ. ఇంతలో నావృద్ధ మాతాపితలు, అదేమోకాని నన్ను చూచి 'కవ్వు'మన్నారు. స్త్రీ హృదయంలో ఎంత సాహసమున్నదో ఎంత అభినివేశముందో, అంత కోమలత్వము, అంత సరళత్వము. కూడా వుంద కాబోలు!! వారిదీనాలాపాల్ని చూచేసరికి నాసాహస హృదయం, నాపట్టుదల అట్టే కరిగిపోతాయి. దేశసేవకై నేను బయలుదేరనున్నానని ఎల్లాగో గ్రహించాడు మానాన్న. రాత్రల్లా నిద్రపట్టిందికాదు నాకు. పరిపరి విధాల ఆలోచనలు పోయాయి: జీవితంలో ప్రతివాడు కోరేది కర్తవ్యపాలనే కదా. కర్తవ్యపాలనముంటేకదా ఆత్మశాంతి ఆనందముపొందేది. నాముదుసలి తలిదండ్రులకు వేరు దిక్కెవ్వరును లేరుగదా! అంతా వారికినేనేకదా! ఎవరైతే నాసుఖమే వారిసుఖముగానెంచి నాజీవితాన్ని యభివృద్ధిలోనికి దీసుకొచ్చి సార్థకము చెయ్యాలని తమశక్తిలోనున్నదాన్నంత త్యాగం చెయ్యటానికికూడ సంసిద్ధమైనారో అట్టి నాతలిదండ్రులసేవయే ఇప్పుడు నా కర్తవ్యపాలన యని నిశ్చయించుకొన్నా. తత్కర్తవ్యపాలనమునందే నాకు ఆత్మశాంతి లభిస్తుందని నిశ్చయించుకున్నాను.

## ౪

మోహన్:—పిన్నీ! నాజైలుజీవితం నాకొక గొప్పపాఠం నేర్పించింది. కష్టసుఖాలను ధైర్యోత్సాహాలతో ఎదుర్కొనేవాడికి లోబడనిది ఏదీలేదు. మనస్సులో వున్నకల్మషం, ఆడంబరము, అహంకారము, స్వార్థము మొదలగువాటిని పోగొట్టుకొనడానికి మార్గంచూపించింది నాజైలుజీవితము. జైలులో గొప్పగొప్పవాళ్ళయొక్క పరిచయంవల్లను సద్గ్రంథ కాలక్షేపంవల్లను, సామాన్య జీవితంవల్లను(Simple life)మనసంఘంలో నీతిపేరిట యవినీతి ఎంతగాఢంగా నానుకొందో గ్రహించడానికి అవకాశంకలిగింది.

శాంత:—అవును, సంఘమురాచారాలన్నీ నీబోటి యువకులు నిర్మూలించి నాబోటి యనాథబాలికలను తరింపజేయాలి. అవిష్ఠవయైన నాజీవితం వ్యర్థమేకదా ప్రపంచములో జీవన్మృతను.

మోహన్:—పిన్నీ! అలా అనొద్దు. సత్యదయాశౌచములనే యాదర్శములుగాగొని, నీముదుసలి తలిదండ్రులసేవ చేస్తున్నా భర్తసేవచేస్తున్నా దేశసేవ చేస్తున్నా ఒకేగమ్యస్థానానికి చేరుతావు. దేశసేవలోను భర్తసేవలోను, నీముసలి తలిదండ్రులసేవలోను సత్యదయాశౌచములే యాదర్శనీయములు. ఫలితము క్రియాబాహుళ్యాన్ని బట్టికాదు భావబాహుళ్యము, నిర్మలత్వాన్నిబట్టి. మిల్టన్ మహాకవియన్నట్లు (The mind is in its own place, And in itself can make a Heaven of Hell, and a Hell of Heaven) అంటే స్వర్గము నరకతుల్యంగాగాని, నరకం స్వర్గ

ల్యంగాగాని, సుస్థిరమనోభావాన్నిబట్టే కలుగుతుంది. కాబట్టి మనోభావమే ప్రధానముకాదు...సరె, వెళ్ళు తా. నేనుగూడ ఇక్కడేవుండి నా భావిజీవితాన్ని ఆదర్శనీయంగా చేసుకోవాలి. సంఘదురాచారాల్ని తెంపి నాభార్యకుకూడ భావిజీవిత సౌభాగ్యాన్ని గురించిన్ని, ఆదర్శకుటుంబ జీవితాన్ని గురించిన్ని విద్యచెప్పాలి.

౫

మర్నాడు మోహనుడు నాపేర "భారతి" 'గృహలక్ష్మి' 'కృష్ణాపత్రిక' 'ఆంధ్రపత్రిక'లను పంపమని తత్పత్రికా కార్యాలయాలకు వ్రాసేడు. ప్రాతఃకాలమునలేచి గృహకృత్యాలు దీర్చుకొంటూ అవకాశము కలిగినప్పుడెల్ల ఏదోఒకటి చదువుతుండే దాన్ని. మానాన్నదగ్గర సంస్కృతాంధ్రములను అభ్యసించేదాన్ని. వూళ్లోవాళ్ళంతా 'నారిముచ్చనీ, భర్తృబహిష్కృతురాలికి పత్రికా పఠనమెందుకనీ, వూళ్ళో నలుగురితోపాటు ఎవరితోను మాటలాడదనీ ఎంతబెట్టుదమ్మా, లోకంలోసంగతులు దీనికెందుకనీ, పరిపరివిధాల వేళాకోళములు చేసేవారు. మానాన్నకు నాయందపారప్రేమ యుండుటచే మనశ్శాంతికిని జ్ఞానాభివృద్ధికిని ఏమిచేసినా యనేవాడుకాదు. నా జీవితము, ఆయనకు స్త్రీవిద్యయందభిమానము కలుగ జేసింది యని వీధులోకెళ్ళగనే మానాన్నను నలుగురు నాలుగుమాటలనేసరికి, పాపం! ఆయన చిన్నవోతుం డేవాడు కాని నాస్వతంత్రప్రవర్తన నాకేసాక్షి. ఎవరే మనుకుంటేనేమి.

మోహనరావు మాపెత్తల్లిమనుమడు; వయస్సునకు చిన్నవాడైనను మంచియాదర్శాలు కలవాడు. ప్రస్తుతము మనదేశమునందు ముఖ్యముగా ప్రతివాడు అభ్యసింపవలసినట్టి సంస్కృతాంధ్ర ఆంగ్ల హిందీభాషలను అభ్యసించేవాడు. మంచివక్త. తానుఏదైతే సత్యమని నమ్ముతాడో, ఎవరేమనుకున్నా, ఎన్ని ఆటంకాలు కలిగినా చేసితీరేవాడు; ఉదారుడు; పరోపకారపరాయణుడు. అత్తవారి వూరివూరే. హైమతలిదండ్రులు పూర్వాచారపరాయణులు. అన్యమతాలపేరు చెప్పితేసరి "శివశివ" యని చెవులు మూసుకుండేవారు శివావధాన్లు. కూతురుకి చదువుచెప్పమని అల్లాచెప్పక పోతే భావిజీవితం భయంకర రూపం దాలుస్తుందని తరువాత పశ్చాత్తాపం పడితే లాభములేదని మామగార్కి మోహనుడెన్నో లేఖలువ్రాసేడు. కాని ఆడవాళ్లకు చదువెందుకు ఈరోజుల్లో ఆడవాళ్ళకుచదువొస్తే ప్రపంచకాన్ని దక్కనిస్తారా. వాళ్ళ శాంతమ్మనుగురించి లోకులు ఎల్లాఅనుకుంటున్నారో చూడుమని చదువు చెప్పించేడుకాదు. హతాశుడై మోహనుడు మావూళ్ళోనే వచ్చివుండడం మొదలెట్టాడు. నయాన భయాన హైమను చేరదీసి చదువు చెప్పేవాడు. హైమతలిదండ్రులకు, వూళ్లో ఇరుగమ్మ పొరుగమ్మలకు 'ఈ అనాచారదృశ్యం' కంటకంగా వుండేది. వూళ్లోవాళ్ళంతా హేళనచేసేవారూ నిందించేవారే కాని వారి భావిజీవితాన్నిగురించి ఆలోచించేవారు ఒకరూలేరు. మోహన్‌కు అత్తమామలకు అప్పుడప్పుడు పెద్దకలహంజరిగేది. చదువుచెప్పుతానంటాడు వీడు! వద్దంటారువాళ్ళు! వూళ్లోవాళ్ళూను! చివరికి వీనిపంతమే నెగ్గేది. అనేవాడు 'పిన్నీ సత్యం నా పక్షముంది కాబట్టే నెగ్గాను.' అని నవ్వుతూ. వాని సత్యదీక్ష సంఘదురాచారాల యెడల తిరస్కరింపు చూసేసరికి వెనుకటి విచారాలన్నీపోయి నూతనోత్సాహం ఆనందం కలిగేదినాకు. రజస్వల అయిన ఆరోజునాటినుండే భార్యయగు హైమను వెంటేసుకొని నదీతీరానికేసి ప్రకృతి సౌందర్యాన్ని అనుభవించుటకు షికారుగా వెళ్ళేవాడు. ఈ విపరీత దృశ్యాన్ని చూచేసరికి మావూరిలోవారందరూ మరీ ఇరుగమ్మ పొరుగమ్మలు వేళాకోళాల్ని నిందల్నికురిపించేవారు. అంతటితో తృప్తిపొందక హైమతల్లిదండ్రులను కేకలెయ్యడం మొదలెట్టారు పాపం! వారేమిచేస్తారు!!అట్టేదిగులుపడి కన్నీళ్ళుకారుస్తుండేవారు.

భార్యాభర్తలిరువురును పవిత్ర గృహస్థాశ్రమపు మహోన్నత తత్వాన్ని బాగా గ్రహించేవరకును, స్త్రీకి కనీసము పదునెనిమిదియేండ్లును పురుషునకు

ఇరువదినాలుగేండ్లును దాటేదాక గృహస్థాశ్రమము స్వీకరించకూడదని దీక్షబూనే హైమామోహనులు. ఐహిక భోగాపేక్షలతోను స్వార్థముతోను నిండిన లోకులు బాహ్యానుకరణమే ప్రధానమని తలచేరే కాని వారి పవిత్రదీక్ష సంగతేమైనా గ్రహించారా? నేను కూడా సంఘంలోవాళ్ళని తిరస్కరించి సాయం కాలము చేలకేసి వెళుతూ సస్యాల సౌందర్యశోభను అనుభవించేదాన్ని. ఊరిలోవాళ్లంతా ఒకటి నేను హైమా ఒకటి. సంఘదురాచారాల్ని తిరస్కరించలేక మొగాళ్ళ దుర్మార్గాలకు 'దాసోహం' యని అత్తవారింటనూ పుట్టింటనూ పడరాని యిక్కట్లుపడు మాబోంట్ల నారీమణు లెందరున్నారో కదా యని యనిపించేది. మాకు, వాళ్ళకుకూడా జ్ఞానమార్గాన్ని చూపించి భర్తృ బహిష్కృత జీవితాల్ని ఆదర్శనీయంగా సార్థకంచేసుకోటానికి ప్రచారం చేయడం కల్పించా. సంఘదురాచారాల్ని. అందును, అబలలపై నలుపు అత్యాచారాల్ని ఖండిస్తూ దినపత్రికలకు మాసపత్రికలకు వ్యాసాలు కల్పనాకథలు వ్రాస్తుండేదాన్ని. ధైర్యంతో సంఘదురాచారాల్ని ఎదుర్కొనేటప్పటికి ఎవ్వరు మాటలాడ సాహసించేవారు కారు. నోరులేని యబలలను అణచటానికి ప్రయత్నించుతారుకదా పురుషులు అని అనుకొన్నా.

గాంధీగారు లండన్‌నుంచి భారత తీరములమీద కాలిడగానే స్వాతంత్ర్య రణభేరి మ్రోగింది. మోహనుడు శాసన తిరస్కారము జేయడానికి సిద్ధమైనాడు. హైమకూడ భర్తతోపాటు కారాగృహానికి వెళ్ళ సమకట్టింది. తలిదండ్రులు ఇరుగమ్మ పొరుగమ్మలు ఆటంకపరిచేరు. వంశానికి అపనింద కలుగజేయడానికి చెడపుట్టిందనీ, బోగందానిలాగు తయారైందనీ, యెవరి ఇష్టమొచ్చినట్లు వారుదూషించేరు. ఇన్నాళ్ళనుంచి గ్రామంలోనేవుండిసంఘంసస్కారాన్ని పూనుకున్నా కాని హైమకూడ మొగాడిలాగు వీధులలో కల్లి మాటలాడి కొట్టువద్ద కల్లుపాకలవద్ద పికెటింగ్ చేయడానికి వెళ్ళేసరికి వూరిలో బ్రాహ్మణులు యావన్మంది శివావధానులుగార్ని శివమ్మగారిని బహిష్కరిస్తామని బెదరించేరు. తలిదండ్రులెంత మొత్తుకున్నా లాభము లేకపోయింది. ఓవైపున బిడ్డయందుండు ప్రేమ, ఇంకొకవైపున సంఘబహిష్కారము!! మధ్యవీరిద్దరు నలిగిపోయినారు పాపం! ఎలా ఏతేనేమి హైమ భర్తతోపాటు జైలుకెళ్ళింది. నాకు కూడా వెళుదామని కోరిక పుట్టింది. కాని నాతలిదండ్రులసేవ నన్నావేశించింది. అదిగాక మాతల్లి రేపోమాపో అన్నట్టి స్థితిలోవుంది.

ఆరుమాసాలైనాయి అప్పుడే స్త్రీసమాజాల్ని చుట్టుప్రక్కలగ్రామాదుల్లోస్థాపించేను. రోజుమధ్యాహ్నము కాసేపు వార్తాపత్రిక చదివి వినిపించేదాన్ని. తరువాత భారతభాగవత కాలక్షేపం చేసేదాన్ని ఐహికభోగాపేక్షలనే ప్రధానముగ గొను పాశ్చాత్య నాగరికతవ్యామోహనమను సుడిగుండమునందు తిరుగు నేటి స్త్రీ సమాజములను ఖండిస్తు, అనుకరణ శీలమును విడనాడి స్వభావశక్తిని, ఆధ్యాత్మికశక్తిని పెంపొందించు సమాజముల నభినందిస్తూండేదాన్ని. సావిత్రి, దమయంతి, పద్మిని, మొదలగు హైందవ నారీరత్నముల మార్గము ననుకరింపుడని ప్రబోధిస్తూ వుండేదాన్ని. దేశహితైక కార్యములందు స్త్రీలు ఝాన్సీలక్ష్మిబాయి వలె పురుషులకు ఏమాత్రము తీసిపోగూడదనియు, పురుషులకు చేయూతనొసగి తమకర్తవ్యమును నెరవేర్చాలనిఉద్బోధన చేసేదాన్ని. ఈవిధంగా సంఘసేవ నాతలిదండ్రులసేవ చేస్తుండేదాన్ని.

## ౬

మోహన్:—నారెండవ యాత్రకూడ ముగించేను హైమఇంకావారంరోజుల్లోవిడుదలౌతుంది. అమ్మమ్మ అవసానకాలమందు చాలా బాధపడ్డదని విని చాలా విచారించాను.

శాంత:—అందరము ఒకరోజు కాకపోతే ఒకరోజైనా పోయేవాళ్లమే. నాజీవితంలో నాతల్లి యెడల నాకర్తవ్యాన్ని పూర్తిగానెరవేర్చగల్గా. అదే నామనస్సుకు శాంతిప్రదాయిని.

మోహన్:—నీబోటి యబలలందరు సంఘానికి వెరచి జీవితాల్ని వృధాగా గడపటము చాలా శోచనీయము!! సంఘమా! ఎంతమందియబలలను, ఎంతమంది నారీమణులను, కూపంలోపడేసి మ్రింగేస్తున్నావు!! వారికిగూడ పురుషులవలెనే సత్కార్యాచరణములయందు నవకాశ మిచ్చేటట్టయితే ఈపాటికల్లా భారతమాత దాస్యశృంఖలాలు తెగిపోయేవే...... పిన్నీ! నేను హైమ అత్తయ్యకు సేవచేస్తూంటాను, నీవుకూడ ఒకసారి జైలుజీవితం అనుభవించిరా. ఈ లోగా నేను ఆశ్రమమును స్థాపించుతాను. అందరము కలిసి సమాజసేవ చేస్తుండవచ్చు.

౮

నాసవతిపేరు సుశీల; సార్థక నామధేయురాలు. సుందరమ్మ చనిపోయిన తరువాత నాథర్తగారికిగూడ కాస్తమైకం విచ్చిపోయింది. తిరిగి నన్ను స్వీకరించమని ఎంతోచెప్పింది సుశీల; కాని నేను జైలుకి వెళ్లానని, ఆశ్రమంలో హరిజనులను చేరదీసి వారి సేవ చేస్తున్నానని స్వీకరించుతే సంఘము బహిష్కరిస్తుందనీ తిరస్కరించేరు ప్రప్రథమమున. సుశీల చాలాగుణవతి. చదువుకాస్త అయినప్పటికీ న్యాయాన్యాయ ధర్మాధర్మవిచక్షణ జ్ఞానమెక్కువ!! ఆమె బోధనలవల్ల నాథర్తహృదయం పూర్తిగమారిపోయింది. తనఅజ్ఞానాన్ని నిందించుకునేవారు. కుటుంబజీవితంలో మాయలమారి అత్తాఆడుబిడ్డలు ఎలాగు విరోధంకల్పించుతారో తెలుసుకున్నారు. నాపవారుచేసిన అన్యాయానికి చాలాపశ్చాత్తాపపడ్డారు. పత్రికలకు తరుచు నేవ్రాసే వ్యాసాలను చదువుతూండేవారు: ముగ్ధులైపోయేవారు. ఒక్కొక్కసారి వ్యాసాల్లోను కల్పనాకథలలోను నేప్రకటించే భావాల్ని సంఘదురాచారాల్ని అబలలపైజరుగు అత్యాచారాల్ని చదువుచు, బొటబొట కన్నీరు కార్చేవారు!! తానుజేసిన మహాపాపానికి పరిహార మేమిటాయని ఆలోచించేవారు.

ఒకరోజున ఆశ్రమంలో ఆశ్రమవాసులకు రాట్నము వడుకుట నేర్పిస్తుంటే సతీసమేతుడై బాష్పాకులనేత్రుడై మోకరించి అన్నారు నాథర్తగారు "శాంతా క్షమించు నీవు నిజంగా శాంతిస్వరూపిణివి"అని. నేను సజలనేత్రురాలనై "మిమ్ముల నేనా క్షమించుట!! మీయందిసుమంతయు తప్పులేదు. సంఘంలో దురాచారా లిట్లుండ దానికి మీరేమి చేయగలరు? నాసోదరి సుశీలను తమ సహధర్మచారిణిగా గొని సాంఘిక రాజకీయాభివృద్ధికై పాటుపడండి. సంయమధారిణినై నాజీవితాన్ని ఈవిధంగా సమాజసేవయందు గడుపుతా.

హైమామోహనులవలె సుశీలాశంకరులు గూడ సంఘసంస్కారమునందును, కాంగ్రెస్సునందును జీవితాల్ని గడుపమొదలెట్టారు. నన్ను ఆశ్రమ యజమానిగా జేసి నా గౌరవార్థమై ఆశ్రమమునకు "శాంతి ఆశ్రమము" అనిపేరుపెట్టారు. ఆశ్రమంలో అందరు నన్ను తల్లివలె గౌరవించడమే కాకుండా నాఆజ్ఞలను కూడ శిరసావహించేవారు. దీనిలో ముఖ్యంగా నావలె భర్తృ బహిష్కృతురాండ్ర యొక్కయు బాలవితంతుల యొక్కయు జీవితాల్ని దేశసేవయందును హరిజనులసేవయందును వినియోగించడానికి ఉద్బోధన జరిగేది. హరిజనుల బాలికలకు గూడ సమాజసేవచేయుటకు తగురీతిగా 5 సంవత్సరాలకు తక్కువకాకుండ విద్యగరపేవాళ్లం. ఆంధ్రదేశపు హరిజనపర్యటన జరిగేటప్పుడు మహాత్ముడు మొన్ననే దీని ప్రథమ వార్షికోత్సవాన్ని జయప్రదంగా జరిపేరు. ఇప్పుడీ యాశ్రమమునందు సంఖ్య 85.

శంకరరావు:—శాంతా! క్షమించావా అన్నాడు భావగంభీరంగాను.

శాంత:—అన్నిటికిని క్షమించువాడు ఆదయామయుడే క్షమించునుగాని నేనెంతటిదానను. పశ్చాత్తాపమేపతితపావనము గదా!